
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

5
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
బుధవారం 17 ఏప్రిల్ 2024

శ్రీ సీతారాముల కల్యాణం చూతము రారండి..

- నేడు అత్యంత వైభవంగా రాములోరి పెళ్లి
- భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో ముస్తాబైన ఆలయాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహక కమిటీలు



ములుగులోని రామాలయాన్ని శుద్ధి చేస్తున్న భక్తులు

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 16: శ్రీరామ నవమి వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా జరగనున్నాయి. శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఇందుకు జిల్లాలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. రాములోరి పెళ్లి మండపాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. పూలు, మామిడి తోరణాలతో తీర్చిదిద్దారు. స్వస్తిశ్రీ శోభకృత్ నామ సంవత్సర చైత్ర శుద్ధ నవమి బుధవారం మధ్యాహ్నం 12.05 గంటలకు శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం జరుగుతుందని వేద పండితులు తెలిపారు.

శ్రీసీతారామ కల్యాణ మహోత్సవం ముఖ్యంగా మహాదేవపూర్ మండలంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయం, గణపురం మండలంలోని రామాలయం, రామలింగేశ్వరస్వామి ఆలయంలో జరగనుంది. చెల్పూరులోని కేటీపీపీ రామాలయం, భూపాలపల్లిలోని శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయం, శ్రీభక్తాంజనేయస్వామి ఆలయం, రేగొండ మండలంలోని రావులపల్లి, రూపిరెడ్డిపల్లిలోని రామాలయంలో కూడా ఈ వేడుకలను వైభవంగా నిర్వహించారు. వీటితోపాటు చిట్యాల మండలంలోని శ్రీపసన్నాంజనేయస్వామి ఆలయం, నైన్‌పాకలోని నాపాక దేవాలయం, కాటారంలోని ఆంజనేయస్వామి ఆలయం, ధన్వాడలోని దత్తాత్రేయస్వామి ఆలయం, బొప్పారంలోని శ్రీరామాంజనేయస్వామి ఆలయం, మల్హర్ మండలంలోని తాడిచర్ల శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు జరగనున్నాయి.

ములుగు జిల్లాలో...

ములుగు: శ్రీరామనవమి వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరగనున్నాయి. ఇందుకోసం అన్ని ఆలయాలలను ముస్తాబు చేస్తున్నారు. నవమి వేడకల్లో సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు ఆలయ, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం ఆలయాలను శుద్ధి చేసి తోరణాలు, పూలతో అలంకరించారు. బుధవారం ఉదయం 9గంటల తర్వాత సీతారాముల కల్యాణాన్ని వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ జరిపిస్తారు. అనంతరం వడపప్పు, బెల్లం పానకం, పులిహోర ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేస్తారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో ఉంచి శోభాయాత్రలు నిర్వహిస్తారు. దేవతా విగ్రహాలకు నీళ్లారబోస్తూ కొబ్బరికాయలు కొడుతూ భక్తులు మంగళహారతులు ఇస్తారు. ప్రతి ఏటా మాదిరిగానే ములుగులోని శ్రీక్షేత్రంలో సీతారాములకు గోటి తలంబ్రాలతో వివాహ క్రతువును జరిపించనున్నారు. ఇందుకోసం స్థానిక మహిళా భక్తులు వారంరోజులుగా తలంబ్రాలను తయారు చేశారు. దుగ్గొండి మండలం ముద్దనూరితండాకు చెందిన అఖిల భారత హనుమాన్ భక్త ప్రచారకుడు గాదరి రాములు ఆయా గ్రామాల్లో భక్తుల నుంచి సేకరించిన గోటి తలంబ్రాలను శ్రీక్షేత్రంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు.



వేడుకలకు ముస్తాబైన భూపాలపల్లి పట్టణంలోని శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయం



ములుగులో తోరణాలను అల్లుతున్న మహిళా భక్తులు



వేడుకలకు సిద్ధమైన గణపురం మండలం చెల్పూరులోని రామాలయం

మనోళ్లు మెరిశారు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐదుగురికి సివిల్స్‌లో ర్యాంకులు

యునైటెడ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మంగళవారం ప్రకటించిన సివిల్స్ ఫలితాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా రత్నాలు మెరిశారు. ఐదుగురు ఉత్తమ ర్యాంకులు సాధించి సత్తాచాటారు. హనుమకొండలోని విద్యుత్ నగర్‌కు చెందిన రావుల జయసింహారెడ్డి 103వ ర్యాంకు సాధించగా, గీసుగొండ మండలం అనంతారం గ్రామానికి చెందిన సైంపు కిరణ్‌కుమార్ 568వ ర్యాంకు సాధించారు. వరంగల్ నగరంలోని శివనగర్‌కు చెందిన కోటే అనిల్‌కుమార్ 743వ ర్యాంకు సాధించారు. అలాగే జనగామ జిల్లా జనగామ పట్టణానికి చెంది నమెరుగు కౌశిక్ 82, జనగామ జిల్లా రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన కొయ్యడ ప్రణయ్ కుమార్ 554వ ర్యాంకు సాధించి సత్తాచాటారు.

- వరంగల్ ఎడ్యుకేషన్/గీసుగొండ/జనగామ కల్చరల్/రఘునాథపల్లి

వివరాలు7వ పేజీలో...

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చుతున్న సీఎం

ఆగస్టు 15 లోగా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తాం

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వరరావు

మహబూబాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో ప్రజల ఆకాంక్షలను నేరవేర్చేలా సీఎం రేవంత్‌రెడ్డి పాలన కొనసాగుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మహబూబాబాద్ డీసీసీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనతికాలంలోనే దేశంలోనే రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలిపేలా ముఖ్యమంత్రి అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. రైతులకు బీమా లేకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తే.. కాంగ్రెస్ సర్కారు అన్నదాతలను ఆదుకోవడానికి ఆ పథకాన్ని తీసుకొస్తోందని అన్నారు. రైతుల పక్షాన రూ.3 వేల కోట్ల ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలకు నష్టం జరిగితే బీమా చెల్లించడం ద్వారా పరిహారం వస్తుందని చెప్పారు. ఆగస్టు 15లోగా రూ.2 లక్షల రుణమాఫీ చేసేందుకు రంగం సిద్ధమైందని, అందుకు ఆర్బీఐతో చర్చలు జరుగుతున్నాయని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు సెప్టెంబర్ 17న రాజీవ్ ప్రాంగణంలో సోనియాగాంధీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలును కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా చేస్తూ వస్తోందని తెలిపారు.

19న మానుకోటకు ముఖ్యమంత్రి

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈనెల 19న మహబూబాబాద్ జిల్లాకు రానున్నారని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ నామినేషన్‌కు సీఎం హాజరుకానున్నారని, తర్వాత పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే ఎన్నికల ప్రచార సభలో ప్రసంగిస్తారని చెప్పారు. శుక్రవారం జరిగే సీఎం సభకు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎన్టీఆర్ స్టేడియంలో సభా స్థలిని పరిశీలించారు. ఈ సమావేశంలో ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, నర్సంపేట, మానుకోట, డోర్నకల్, భద్రాచలం, పినపాక ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, భూక్య మురళీనాయక్, జాటోతు రాంచంద్రునాయక్, తెల్లం వెంకట్రావ్, పాయం వెంకటేశ్వర్లు, నాయకులు ఘనపురపు అంజయ్య, నూనావత్ రాధ, బండారు వెంకన్న, నారోజు సత్యమనోరమ, చుక్కల ఉదయ్‌చందర్, గునిగంటి కమలాకర్, బోడ రవినాయక్ పాల్గొన్నారు.

భూకబ్జా కేసులో మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ అరెస్టు



మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్‌ను విచారిస్తున్న సీఐ నరేష్‌కుమార్

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఏప్రిల్ 16: భూ కబ్జా కేసులో భూపాలపల్లి మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్ కొత్త హరిబాబు అరెస్టు అయ్యారు. ఈ మేరకు భూపాలపల్లి సీఐ నరేష్ కుమార్ మంగళవారం వెల్లడించారు. తన జామాయిల్ తోటను ధ్వంసం చేసి, కాపలాదారులపై దాడి చేసి ఆ భూమిని కబ్జా చేసేందుకు హరిబాబు యత్నించారంటూ భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని ఖాసింపల్లికి చెందిన నూనేటి అనిల్‌కుమార్ యాదవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. విచారణ అనంతరం హరిబాబును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు : ఎస్పీ

భూకబ్జాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తప్పవని భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సామాన్యులకు, పేదలకు న్యాయం చేయడమే తమ పోలీసు శాఖ అభిమతమని పేర్కొన్నారు. అక్రమార్కులు ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని సూచించారు.

బీఆర్ఎస్ సమన్వయకర్తల నియామకం

రాంనగర్, ఏప్రిల్ 16: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా వరంగల్ లోక్‌సభకు సంబంధించి నియోజకవర్గ సమన్వయకర్తలను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం నియమించారు. పరకాల నియోజకవర్గానికి శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, పాలకుర్తికి ఎమ్మెల్సీ సిరికొండ మధుసూధనాచారి, మెట్టు శ్రీనివాస్, స్టేషన్ ఘనపూర్‌కు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వరంగల్ వెస్ట్‌కు మర్రి యాదవరెడ్డి, నాగుర్ల వెంకటేశ్వర్లు, సంగంరెడ్డి సుందర్‌రాజ్, వరంగల్ ఈస్ట్‌కు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వర్ధన్నపేటకు కె.వాసుదేవరెడ్డి, సాంబారి సమ్మారావుకు, భూపాలపల్లి నియోజకవర్గానికి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య నియామకమయ్యారు.

ఉలిక్కిపడిన చల్లగరిగ

- ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో సిరిపెల్లి సుధాకర్ మృతి
- తొమ్మిదో తరగతిలోనే అజ్ఞాత వాసం
- 2000లో పీపుల్స్‌వార్‌లో చేరిక
- మరణవార్త వినడంతో కన్నీరమున్నీరైన తల్లి, గ్రామస్థులు

6లో



సుధాకర్ మృతి వార్త విని రోదిస్తున్న తల్లి రాజపోచమ్మ

అరాచక పాలన నుంచి
దేశాన్ని రక్షించుకోవాలి

- బీజేపీకి గుణపాఠం చెప్పాలి
- కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకూ సమన్యాయం
- వరంగల్ పార్లమెంటరీ ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- భూపాలపల్లిలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం
- హాజరైన ఎంపీ అభ్యర్థి కడియం కావ్య, ఎమ్మెల్యేలు



మాట్లాడుతున్న వరంగల్ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 16: బీజేపీ అరాచక పాలన నుంచి దేశాన్ని రక్షించుకోవాలని కాంగ్రెస్ వరంగల్ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ వరంగల్ పార్ల మెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధ్యక్షతన భూపాలపల్లి పట్టణ పరిధి కందూరుపల్లిలోని ఏఎస్ఆర్ గార్డెన్స్‌లో మం గళవారం జరిగింది. వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య, స్టేషన్‌ఘనపూర్, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు అనుమాండ్ల యశస్విని, కె.నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవూరి మాట్లాడుతూ పేదలకు అండగానే ఉండే పార్టీ ఒక్క కాంగ్రెస్ మాత్రమేనని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరగాలంటే కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. బీజేపీ అరాచక పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించారు. దేశంలో కులమతాల మధ్య కలహాలు సృష్టించి రాజకీయ ప్రయోజనం పొందాలనుకుంటున్న బీజేపీకి గుణపాఠం చెప్పాల న్నారు. దేశ ప్రజల మధ్య ఐక్యత కోసం రాహుల్ గాంధీ విశేష కృషి చేస్తున్నారని అన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు భారత్ జోడో యాత్ర చేపడుతూ ప్రజలకు భరోసా ఇచ్చారని తెలిపా రు. అన్ని వర్గాల కూ న్యాయం చేకూరేలా జనగణన చేపట్టాలని రాహు ల్ గాంధీ ఆకాంక్ష అన్నారు. కాంగ్రెస్ తోనే ప్రజా సంక్షేమం, దేశావృద్ధి సాధ్యమన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతై నా ఉందని అన్నారు.

సమన్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం...

- ఎంపీ అభ్యర్థి కడియం కావ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి కడియం కావ్య

ప్రజలకు సమ న్యాయం జరగాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమని వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య అన్నారు. రాష్ట్రంలో ఏ విధం గా కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చామో, అదే విధంగా కేంద్రం లోనూ తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. సింగరేణిని పూర్తిగా ప్రైవేటీకరణ చేయాలని బీజేపీ ప్రభుత్వం చేసి ప్రయత్నాలను కాంగ్రెస్ అడ్డుకుందని గుర్తు చేశారు. అలాగే రైల్వే, ఎల్ఐసీ తదితర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీక రణ చేయాలని మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని విమర్శించారు. రిజర్వేషన్లను రద్దు చేయాలని, రాజ్యాంగాన్ని మార్చివేయాలని, అంబేద్కర్ విగ్రహాల ను తొలగించాలని చూస్తోందని దుయ్యబట్టారు. రాహుల్‌గాంధీ పాంచ్‌న్యాయ్ పేరుతో దేశంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరగాలనే ఆలోచ నతో ఉన్నారన్నారు. ఈ క్రమంలోనే ఆ అంశాలను మేనిఫెస్టోలో పెట్టారని తెలిపారు. శ్రామిక న్యాయం పేరుతో ఉపాధి కూలీలకు వేతనం రూ.400కు పెంచాలని, జీఎస్టీ లేకుండా రైతులకు బీమా సౌకర్యం కల్పించడం, పరికరాలు అందించడం, రుణమాఫీ చేయడం తదితర అనేక పథకాలు అమలు చేయనున్నారని అన్నారు. అలాగే 30లక్షల ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. భూకబ్జాదారుడైన అరూరి రమేష్‌ను గెలిపిస్తే ఇక్కడి సంపదను కూడా ఆయన దోచుకువెళ్తారని వ్యాఖ్యానించారు.

ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, యశస్వినిరెడ్డి, నాగరాజు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన పార్టీ కాంగ్రెస్‌అన్నారు. మతతత్వ బీజేపీకి ఓటువేస్తే సామాన్యుడికి న్యాయం జరగదని అన్నారు. పార్లమెంట్ ఎన్నికలు ముగియగానే రూ. 100 కోట్లతో భూపాలపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. అనంతరం రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, పార్లమెంట్ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి కత్తి వెంకటస్వామి, వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ పనితీరును ఎండగట్టారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, కాంగ్రెస్ నేతలు రాంనర్సింహారెడ్డి, ఎన్ఎస్ఆర్ సంపత్, చల్లూరి మధు, బుర్ర కొంరయ్య, దాట్ల శ్రీనివాస్, అంబాల శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి గుణపాఠం చెప్పాలి

జిల్లా స్థాయి సమావేశంలో వామపక్ష నేతలు



సదస్సులో నినదిస్తున్న వామపక్ష నేతలు

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 16: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలని వామపక్ష నేతలు పిలుపునిచ్చారు. ములుగులో మంగళవారం జరిగిన జిల్లాస్థాయి సమావేశంలో ఎంసీపీఐ(యూ) పొలిట్‌బ్యూరో సభ్యుడు, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్, న్యూడెమోక్రసీ నాయకుడు మధు, ప్రజాసంఘాల నాయకుడు ముంజాల బిక్షపతిగౌడ్ మాట్లాడారు. దేశంలో నరేంద్రమోదీ అరాచక పాలనకు పదేళ్లు పూర్తయిందని వ్యాఖ్యానించారు. ప్రజలు, కార్మికుల హక్కులను కాలరాస్తూ రైతాంగ సమస్యలను బీజేపీ విస్మరించిందని విమర్శించారు. దేశంలో నిరుద్యోగం విలయతాండవం చేస్తోందన్నారు. దేశ సంపదను అదానీ, అంబానీలకు కేంద్ర ప్రభుత్వం దోచిపెడుతోందని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో మళ్లీ విజయం సాధించాలనే ఉద్దేశంతో ప్రజలకు తప్పుడు సందేశం ఇస్తూ, మతోన్మాదాన్ని ముందుకు తీసుకొస్తున్న మోదీకి ప్రజలు సరైన గుణపాఠం చెప్పాలన్నారు. ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేసి అవినీతికి మారుపేరుగా బీజేపీ నిలిచిందని దుయ్యబట్టారు. ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ రాజ్యాంగాన్ని మార్చి మనువాద సంస్కృతిని అమలుపరిచేవిధంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ఈ సదస్సులో వామపక్ష సంఘాల నేతలు బీరెడ్డి సాంబశివ, పొదిళ్ల చిట్టిబాబు, తీగల ఆగిరెడ్డి, గొంది రాజేష్, ముత్యాల రాజు, ఇంజం కొమురయ్య, పల్లెబోయిన స్వామి, నర్సింహ, గుండబోయిన చంద్రయ్య, రాంరెడ్డి, ముక్తి సత్యం, ప్రతాప్‌రెడ్డి, కొర్ర రాజు, రత్నం ప్రవీణ్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ రంగనాథ్

ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలి

మల్టీజోన్-1 ఐజీ ఏవీ రంగనాథ్ ● ములుగులో నేర పరిశీలన సమీక్ష

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 16: రాబోయే పార్లమెంట్ ఎన్నికలను నిష్పక్షపాతంగా, శాంతియుతంగా నిర్వహించాలని మల్టీజోన్-1 ఐజీ ఏవీ.రంగనాథ్ అన్నారు. ములుగులోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఎస్పీ శబరీశ్ అధ్యక్షతన నేర పరిశీలన సమీక్ష సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పెండింగ్ కేసులపై పోలీస్‌స్టేషన్ల వారీగా ఐజీ సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ 2022 కన్నా ముందు పెండింగ్‌లో ఉన్న కేసులను నెల రోజుల్లో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ములుగు జిల్లాలో మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న దృష్ట్యా రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. ఛత్తీస్‌గఢ్, ములుగు సరిహద్దు ప్రాంతాల్లో స్పెషల్ పార్టీ బలగాల ద్వారా ముమ్మర తనిఖీలు నిర్వహించాలన్నారు. ప్రజలకు ఎన్నికల ప్రక్రియ పట్ల నమ్మకం కలిగేలా గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాలని, నగదు, మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేలా చెక్‌పోస్టుల వద్ద నిత్యం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గంజాయి రవాణా ఎక్కువ జరుగుతున్న నేపథ్యంలో జిల్లా రహదారులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. ప్రధాన, ఇతర కూడళ్ల వద్ద ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి తనిఖీలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఏటూరునాగారం ఏఎస్పీ గీతే మహేష్ బాబా సాహెబ్, డీఎస్పీలు రవీందర్, రాములు, స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ములుగు, పస్రా, ఏటూరునాగారం, వెంకటాపురం సీఐలు రంజిత్‌కుమార్, శంకర్, రాజు, బండారి కుమార్, ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు.

ఉలిక్కిపడిన చల్లగరిగ

ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో సిరిపెల్లి సుధాకర్ మృతి

చిట్యాల, ఏప్రిల్ 16: భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని చల్లగరిగ గ్రామానికిచెందిన సిరిపెల్లి సుధాకర్ అలియాస్ శంకర్‌రావు ఉద్యమ ప్రస్థానం ముగిసింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్, బస్తర్ ప్రాంతంలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో సుధాకర్ మృతిచెందినట్లు తెలియడంతో చల్లగరిగ గ్రామం ఉలిక్కిపడింది. సిరిపెల్లి ఓదెలు - రాజపోచమ్మ దంపతులకు ఓ కుమారుడు, ఓకుమార్తె కాగా, సుధాకర్ స్థానికంగా 9వ తరగతి చదువుతున్న క్రమంలో పీపుల్స్‌వార్ పార్టీలో సానుభూతి పరుడిగాపనిచేసి 2000లో పూర్తిస్థాయిలో అజ్ఞాతంలోకి వెళ్లాడు. తన చిన్నమ్మ కుమారుడు కలికోట శంకర్ అప్పటికే పీపుల్స్‌వార్‌లో ఉండంతో సుధాకర్ పార్టీకి దగ్గరయ్యాడు. సుధాకర్ తండ్రి ఓదెలు 15 యేళ్ల కిందట మృతి చెందాడు. ఇక సోదరి స్వరూప, ఆమె భర్త మృతిచెందడంతో వారి కుమార్తె, కుమారుడిని సుధాకర్ తల్లి రాజపోషమ్మ పోషిస్తోంది. మనవరాలికి వివాహం కాగా, మనువడు హైదరాబాదులో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. రాజపోషమ్మ చల్లగరిగలోని ఇంటివద్దే ఉంటూ వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తోంది. సుధాకర్ మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడన్న వార్త తెలవడంతో రాజపోషమ్మ, కుటుంబ సభ్యులు కంటతడి పెట్టారు.

స్నేహంతో ముడిపడిన నేపథ్యం

చల్లగరిగ గ్రామానికి చెందిన సిరిపెల్లి సుధాకర్, రౌతు విజేందర్ స్నేహితులు, సుధాకర్ అన్న కలికోట శంకర్ పీపుల్స్‌వార్‌లో పనిచేస్తుండడంతో వీరు కూడా అటు నడిచి.. 1996-98ల్లో వరంగల్ సెంట్రల్ జైలు జీవితం గడిపారు. 2000లో సుధాకర్, విజేందర్ పూర్తి స్థాయిలో దళ సభ్యులుగా ఉద్యమ జీవితాన్ని ప్రారంభించగా విజేందర్ అలియాస్ శ్రీను ఐదేళ్ల కిందట ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. సుధాకర్ నిజామాబాద్ జిల్లా ఏరియా జిల్లా కమిటీ సభ్యుడిగా, అనంతరం శంకర్ పేరుతో ఛత్తీస్‌గఢ్ ఏరియాలో జిల్లా కార్యదర్శిగా పని చేసినట్లు సమాచారం.

అడవిలో ముగిసిన చల్లగరిగ ప్రస్థానం

చల్లగరిగ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మావోయిస్టు ఉద్యమాల్లో చురుకైన పాత్రను పోషించారు. కలికోట శంకర్ 1996లో భూపాలపల్లి ఏరియాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో, రౌతు విజేందర్ ఐదేళ్ల కిందట, తాజాగా సిరిపెల్లి సుదాకర్ మృతితో ఉద్యమ నేపథ్యం ముగిసింది.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను

పకడ్బందీగా నిర్వహించాలి..

ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్గొండ కలెక్టర్ హరిచందన

నియోజకవర్గ పరిధిలోని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 16: ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఆయా జిల్లాల కలెక్టర్లు కృషిచేయాలని ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్గొండ కలెక్టర్ హరిచందన కోరారు. ఈ మేరకు నల్గొండ కలెక్టరేట్ కార్యాల యం నుంచి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గపరిధిలోని వివిధ జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఇతర అధికారులతో మంగళవారం సాయంత్రం ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్గొండ కలెక్టర్ హరిచందన వీడియో కాన్ఫరెన్స్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సిబ్బంది, శిక్షణ కేంద్రాల గుర్తింపు, డీఆర్సీ, స్ట్రాంగ్ రూమ్స్, ఎఫ్ఎస్టీ, ఎంసీసీ బృందాల ఏర్పాటు, మాస్టర్ ట్రైనర్లు, నోడల్ అధికారుల నియామకం, జోనల్ ఆఫీసర్, సెక్టార్ అధికారులు, రూట్ అధికారులు, పోలింగ్‌కు అవసరమైన వాహనాలు తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారి హరిచందన వివిధ జిల్లాల కలెక్టర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, పరకాల, హనుమకొండ ఆర్డీవోలు డాక్టర్ కె.నారాయణ, ఎన్.వెంకటేష్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

మనోళ్లు మెరిశారు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐదుగురికి సివిల్స్ ర్యాంకులు


కుటుంబ సభ్యులతో 568వ ర్యాంకు సాధించిన సైంపు కిరణ్‌కుమార్


కుటుంబ సభ్యులతో కౌశిక్


తల్లిదండ్రులతో 554వ ర్యాంకు సాధించిన ప్రణయ్ కుమార్

వరంగల్ ఎడ్యుకేషన్/ గీసుకొండ, ఏప్రిల్ 16: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మంగళవారం ప్రకటించిన సివిల్స్ ఫలితాల్లో ఉమ్మడి జిల్లా యువకులు మెరిశారు. మొత్తం ఐదుగురు ఉత్తమ ర్యాంకులు సాధించారు. హనుమకొండ జిల్లా కేంద్రంలోని విద్యుత్ నగర్‌కు చెందిన రావుల జయసింహారెడ్డి 103 ర్యాంకు, వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన సైంపు కిరణ్‌కుమార్ 568, వరంగల్ జిల్లా కేంద్రంలోని శివనగర్‌కు చెందిన కోటే అనిల్‌కుమార్ 743, జనగామ పట్టణానికి చెందినమెరుగు కౌశిక్ 82, జనగామ జిల్లా రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన కొయ్యడ ప్రణయ్ కుమార్ 554వ ర్యాంకు సాధించి సత్తాచాటారు. వీరిలో హనుమకొండ విద్యుత్‌నగర్‌కు చెందిన జయసింహారెడ్డి గతేడాది సివిల్స్‌లో 217వ ర్యాంకు సాధించి ఐపీఎస్ శిక్షణలో ఉన్నారు. కానీ ఐఏఎస్ లక్ష్యంతో తాను సివిల్స్ రాశానని, ఇప్పుడు వచ్చిన ర్యాంకుతో ఐఏఎస్ వచ్చే అవకాశం లేదని జయసింహారెడ్డి తెలిపారు. అనిల్‌కుమార్ స్పందిస్తూ గతేడాది 4వ ప్రయత్నంలో 584 ర్యాంకు రాగా, ఇండియన్ పోస్టల్ సర్వీస్‌లో అకౌంట్స్ విభాగం కోల్‌కత్తాలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నానని, చివర ప్రయత్నంగా ఐఏఎస్ గాని ఐపీఎస్ గానీ వస్తుందన్న ధీమా వ్యక్తం చేశారు.

జనగామ జిల్లాలో ఇద్దరికి ఉత్తమ ర్యాంకు

జనగామ కల్చరల్ / రఘునాథల్లి: జనగామ జిల్లా నుంచి ఇద్దరు యువకులు సత్తా చాటారు. జిల్లాకేంద్రానికి చెందిన మెరుగు సుజాత - సుధాకర్ దంపతుల కుమారుడైన మెరుగు కౌశిక్ యూపీఎస్సీ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో 82వ ర్యాంకు సాధించాడు. జనగామలోని సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో ప్రాథమిక విద్యనభ్యసించిన కౌశిక్ ఆ తర్వాత హైద్రాబాద్ లో హైస్కూల్ విద్య పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ లో బీటెక్ పూర్తి చేసి ఢిల్లీ లోని ఐఎఎఫ్‌టీ లో సివిల్ కోచింగ్ తీసుకొని మొదటి ప్రయత్నంలోనే జాతీయ స్థాయి 82వ ర్యాంకు సాధించాడని తల్లిదండ్రులు తెలిపారు. కాగా కౌశిక్ తండ్రి సుధాకర్ 20 ఏళ్లుగా హైద్రాబాద్‌లో బిల్డర్‌గా స్థిరపడ్డారు.

నిరుపేద విద్యార్థికి 554వ ర్యాంకు

రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన కొయ్యడ ప్రణయ్ కుమార్ అనే నిరుపేద విద్యార్థి తన రెండో ప్రయత్నంలో 554వ ర్యాంకు సాధించి సివిల్స్‌కు ఎంపికయ్యాడు. రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన కొయ్యడ ప్రభాకర్-లక్ష్మి దంపతులు బతుకుదెరువు కోసం కొన్ని సంవత్సరాల క్రితం హైదరాబాద్ వలస వెళ్లారు. వారి మూడో కుమారుడైన ప్రణయ్ కుమార్ పదోతరగతి వరకు నాగారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, పాలిటెక్నిక్.. గజ్వేల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో, కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో బీ టెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ చదివాడు. అనంతరం ఎలాగైనా సివిల్స్ సాధించాలనే పట్టుదలతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే స్టడీ సర్కిల్‌లో చేరి కష్టపడి చదివి రెండవ ప్రయత్నంలో 554వ ర్యాంకు సాధించి సివిల్స్‌కు ఎంపికయ్యాడు. దీంతో ప్రణయ్ కుమార్‌కు ఐఏఎస్ అయ్యే అవకాశం రానుండగా..

గతేడాది యూపీఎస్సీ పరీక్షలో మొదటి సారే ప్రణయ్ కుమార్ 885వ ర్యాంకు సాధించి ఐఎఫ్ఎస్‌కు ఎంపికయ్యాడు. ఈ ర్యాంకుతో ఐఏఎస్ అవకాశం రాకపోవడంతో రెండో సారి ప్రయత్నించగా 554వ ర్యాంకు వచ్చింది. దీంతో ప్రస్తుతం రఘునాథపల్లిలోనే నివాసముంటున్న ప్రణయ్ కుమార్ కుటుంబ సభ్యుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా ప్రణయ్ కుమార్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

సాధారణ కుటుంబం నుంచి

వరంగల్ జిల్లా గీసుగొండ మండలం అనంతారం గ్రామానికి చెందిన సయింపు ప్రభాకర్, జయలక్ష్మి కుమారుడు కిరణ్ మంగళవారం యూపీఎస్సీ ఫలితాల్లో 568 ర్యాంకు సాధించారు. సాధారణ వ్యవసాయ కుటుంబం నుంచి ఐపీఎస్‌గా ఎంపిక కానున్న కిరణ్ గతంలో సెంట్రల్ ఆర్మీ పోలీస్ ఫోర్స్(సీఏపీఎఫ్)లో కూడా ఆల్ ఇండియా 15వ ర్యాంకు సాధించి అసిస్టెంట్ కమాండెంట్‌గా పనిచేశారు. అనంతరం ఉద్యోగానికి రాజీనామా చేసి ఐఏఎస్ సాధించటమే లక్ష్యంగా యూపీఎస్సీ పరీక్షకు హాజరయ్యారు. ఈసారి కిరణ్ ఇండియన్ ఇన్‌ఫర్మేషన్ సర్వీస్(ఐఐఎస్) అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. అనంతరం ఇండియన్ పోస్టల్ సర్వీస్ అధికారిగా అవకాశం వచ్చిన కిరణ్ విధులు నిర్వహిస్తూనే చివరి ప్రయత్నంగా మరోసారి యూపీఎస్సీ పరీక్షకు హాజరై 568ర్యాంకు సాధించారు. అనుకున్న లక్ష్యానికి చేరువయ్యాడు. దీంతో ఆయనకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణ వ్యవసాయకుటుంబానికి చెందిన ప్రభాకర్, జయలక్ష్మీ దంపతులకు కుమారుడు కిరణ్, కుమార్తె గిరిజ ఉన్నారు. ఎంతో కష్టపడి ప్రభాకర్ దంపతులు కిరణ్, గిరిజను చదివించగా.. గిరిజ కూడా ట్రిపుల్ ఐటీ చెన్నైలో ఎం.టెక్ పూర్తి చేసి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. కిరణ్ 3వ తరగతి వరకు మచ్చాపూర్, 5వ తరగతి వరకు గిర్నిబావి వద్ద గల ఓ ప్రైవేటు పాఠశాలలో చదివాడు. అనంతరం జవహర్ నవోదయ ఎంట్రన్స్ పరీక్ష రాసి వరంగల్ మామునూరు నవోదయ పాఠశాలలో సీటు సాధించాడు. అక్కడ పదోతరగతి పూర్తిచేసిన కిరణ్ గుంటూరు బాష్యం పాఠశాలలో ఇంటర్, ఐఐటీ ఢిల్లీలో 2017లో బీటెక్ పూర్తిచేశాడు. అనంతరం సివిల్స్‌పై దృష్టిపెట్టి విజయం సాధించాడు.

ఐఏఎస్ రాకపోవచ్చు..

రావుల జయసింహారెడ్డి, ఐపీఎస్

గత ఏడాది సివిల్స్ ఫలితాల్లో 217వ ర్యాంకు రాగా ఐపీఎస్ సాధించాను. ఐఏఎస్ కావాలనే ఆశయంతో మళ్లీ సివిల్స్ రాశాను. అయితే ఈ సారి 103వ ర్యాంకు వచ్చింది. జనరల్ కేటగిరీలో ఐఏఎస్ రాకపోవచ్చు. నాకు ఎళ్లవేళలా తోడ్పాటును అందిస్తున్న అమ్మానాన్న డాక్టర్ రావుల ఉమారెడ్డి-లకు ఎప్పుడూ విధేయపాత్రుడుగానే ఉంటాను. వరంగల్ ప్రాంతీయ పరిశోధన స్థానంలో ఏడీగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ రావుల ఉమారెడ్డి కుమారుడే జయసింహారెడ్డి కావడం విశేషం.

ఆఖరి ప్రయత్నంలో సాధించా..

సైంపు కిరణ్‌కుమార్, ఇండియన్ పోస్టల్ సర్వీస్, ఆంధ్రప్రదేశ్

ఐఏఎస్ లేదా ఐపీఎస్ కావాలనే ఉన్నత లక్ష్యంతో చదివాను. ఐఐటీ ముంబై, చైన్నై ఐఐటీల్లో సీటు వచ్చినా సివిల్స్ ప్రిపేర్ కావచ్చుననే ఆశయంతో ఢిల్లీ ఐఐటీలో చేరాను. ఐదో ప్రయత్నంలో రిజర్వ్‌డ్ ర్యాంకుతో ఇండియన్ పోస్టల్ సర్వీస్‌లో ఉద్యోగంలో చేరాను. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్టణాల్లో పని చేస్తున్నాను. ఐఏఎస్ లక్ష్యంతో ఆఖరి ప్రయత్నంగా ఆరోసారి సివిల్స్ రాశాను. ఇప్పుడు వచ్చిన ర్యాంకుతో ఐఆర్ఎస్ వచ్చే అవకాశం ఉంది. ప్రజలకు నిరంతరం సేవ అందించడమే నా లక్ష్యం. కాగా, అనంతారానికి చెందిన కిరణ్‌కుమార్ తల్లిదండ్రులు ప్రభాకర్-జయలక్ష్మి రైతులు.

ఐఏఎస్ లక్ష్యంతో ఆఖరి సారి రాస్తాను..

కోటే అనిల్‌కుమార్, డీడీ, ఇండియన్ పోస్టల్ సర్వీసెస్, వెస్ట్‌బెంగాల్

ఇప్పటివరకు 5సార్లు సివిల్స్ రాశాను. నాలుగోసారి వచ్చిన 584 ర్యాంకుతో ఇండియన్ పోస్టల్ సర్వీసెస్‌లో ఎకౌంట్స్ విభాగంలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాను. నిట్ వరంగల్ నుంచి ఇంజనీరింగ్ పట్టా అందుకున్నాక రెండేళ్ల ఏఈగా పనిచేశారు. అనంతరం రైల్వేస్‌లో పని చేశారు. గత ఏడాది సివిల్స్‌లో వచ్చిన ర్యాంకుతో ప్రస్తుతం పోస్టల్ సర్వీసెస్‌లో పనిచేస్తున్నారు. ఇప్పటికీ ఐదుసార్లు రాశాను. ఆఖరి ప్రయత్నంగా మరోసారి సివిల్స్ రాసి ఉన్నత లక్ష్యాన్ని సాధిస్తాను.

రేపటి నుంచి 'లోక్‌సభ'

నామినేషన్ల స్వీకరణ

25 వరకు దాఖలుకు అవకాశం

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 16: లోక్‌సభ ఎన్నికలకు గాను గురువారం నోటిఫికేషన్ వెలువడనుండగా.. ఆదేరోజునుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. 25వ తేదీ వరకు దాఖలుకు అవకాశం ఉండగా.. అభ్యర్థులు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి ఉచితంగా పొందవచ్చు. సెలవులు మినహా మిగిలిని రోజుల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. వరంగల్ నియోజకవర్గానికి సంబంధించి వరంగల్ కలెక్టరేట్‌లో, మహబూబాబాద్ నియోజకవర్గానికి సంబంధించి మహబూబాబాద్ కలెక్టరేట్‌లో అభ్యర్థులు నామినేషన్లు సమర్పించాల్సి ఉంటుంది. ఈ నామినేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు యంత్రాంగం పటిష్ఠ ఏర్పాట్లు చేస్తోంది.

అభ్యర్థులు పాటించాల్సినవి..

- ఒక్కో అభ్యర్థి నాలుగుసెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చు. అభ్యర్థి వెంట నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుంది.
- జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల తరఫున పోటీ చేసే అభ్యర్థులకు వారు పోటీ చేసే నియోజకవర్గంలోని ఎవరైనా ఒక ఓటరు ప్రతిపాదించాల్సి ఉంటుంది. రిజిస్టర్డ్ రాజకీయ పార్టీల తరఫున పోటీ చేసే వారికి, స్వతంత్ర అభ్యర్థులకు 10మంది ఓటర్లు ప్రతిపాదించాలి.
- పోటీ చేసే అభ్యర్థులు వేరే లోక్‌సభ సెగ్మెంట్‌కు చెందిన వారైతే తప్పనిసరి వారి అసెంబ్లీ నియోజకవర్గ ఈఆర్వో నుంచి ఓటరు ధృవీకరణ పత్రం సమర్పించాలి.
- అభ్యర్థులు గరిష్ఠంగా రూ.95లక్షల వరకు ఎన్నికల్లో ఖర్చు చేయవచ్చు. సంబంధిత బ్యాంకు ఖాతా లావాదేవీల ఆధారంగానే అభ్యర్థులు వ్యయాన్ని లెక్కిస్తారు.
- క్రిమినల్ కేసులు ఉంటే నామినేషన్ పత్రంలోని పార్ట్-3ఏలో ఆ వివరాలు తప్పనిసరిగా పొందుపర్చాలి.
- ప్రచార సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తుగానే దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలి.
- కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు ముంద్రించే విషయంలో సెక్షన్ 127-ఏ సూచనలు పాటించాలి.
- ప్రచార కార్యక్రమాలు, సభలు, సమావేశాలకు సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

క్రీడాకారుల వసతిని నిలిపి వేస్తే సహించేది లేదు..

మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్16: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ (జేఎన్ఎస్)లో అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారుల కోసం నిర్వహిస్తున్న రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో వసతిని నిలిపివేస్తే సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. వివిధ క్రీడలకు నిలయంగా విరాజిలుతున్న జేఎన్ఎస్‌లో పలురకాల క్రీడలతో పాటు అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాంశాలలో శిక్షణ పొందుతూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో రాణిస్తూ పలు పతకాలను సాధిస్తున్నారన్నారు. రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో పలు క్రీడాంశాలలో శిక్షణ పొందుతూ స్పోర్ట్స్ హాస్టల్‌లో వసతి పొందుతున్న క్రీడాకారులను మినహాయించి అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారుల వసతి నిలిపి వేసే యోచనలో స్పోర్ట్స్ అధికారులు ఉన్నారని తమకు విశ్వసనీయ సమాచారం ఉందన్నారు. ఏళ్ల చరిత్ర కలిగిన రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులు వసతిని ఎత్తివేసే యోచనను స్పోర్ట్స్ అధికారులు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

కడియం శ్రీహరి రాజకీయ ద్రోహి

● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ● రాజకీయ ఊసరవెల్లి కడియం శ్రీహరి : పల్లా ● మడికొండలో లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

మడికొండ, ఏప్రిల్ 16: దేశంలోనే నెంబర్ వన్ రాజకీయ ద్రోహి, నీతిమాలిన రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ కడియం శ్రీహరి అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధ్వజమెత్తారు. మడికొండలోని సత్యసాయి గార్డెన్స్‌లో మంగళవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన లోక్‌సభ ఎన్నికల స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కార్యకర్తల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాజీమంత్రి దయాకర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాజకీయాల్లో ఇంత దిగజారిన మోసగాడిని ఇంతవరకు చూడలేదన్నారు. కేసీఆర్ ఆయనకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రి, ఉపముఖ్యమంత్రి పదవి, ఆయనకు కూతురుకు ఎంపీ టికెట్ ఇచ్చినా పార్టీ మారాడని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీ మారానని చెప్పుకోవడానికి సిగ్గుండాలన్నారు. దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తిరిగి పోటీ చేసి గెలవాలని ఎర్రబెల్లి సవాల్ విసిరారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఒక్కటి కూడా అమలు చేయలేదని అన్నారు. ఒక్కఆర్టీసీ ఉచిత ప్రయాణం అమలు చేశారని, కొద్ది రోజుల తర్వాత అదికూడా ఎత్తేస్తారని జోస్యం చెప్పారు. నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇద్దామని దయాకర్‌రావు తెలిపారు. శాసన మండలి వైస్‌చైర్మన్ బండా ప్రకాశ్ మాట్లాడుతూ... తెలంగాణ రాజకీయాల్లో ఎవరు దొంగ అంటే కడియం శ్రీహరి పేరు చెబుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన బీఫామ్‌తో గెలిచిన కడియం శ్రీహరి.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఒకవైపు, కాంగ్రెస్ పార్టీ మరోవైపు రెండు పార్టీలు ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలు అవుతున్నాయో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కడియం శ్రీహరి పార్టీలు మారడం చూసి ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతోందన్నారు. ద్రోహం అంటేనే కడియం శ్రీహరి అన్నారు. 2023లో ఎదురు గాలి వీచినా స్టేషన్ ఘన్‌పూర్ ప్రజలు గులాబీ జెండాను చూసి కడియంను గెలిపించారన్నారు. ఘన్‌పూర్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే రాజయ్య, తాను అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని పేర్కొన్నారు. జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ రెండు నియోజకవర్గాలను రెండు కళ్లుగా కాపాడుకుంటానని స్పష్టం చేశారు. నాయకులకు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. ఇప్పుడు జరుగుతున్న ఎన్నిక ఒక మోసగాడికి, ఒక నీతిమంతుడికి జరుగుతున్న పోరు అని తెలిపారు. సుధీర్‌కుమార్‌ను అధిక మెజారిటీతో గెలిపించి ఢిల్లీకి పంపుదామని స్పష్టం చేశారు.

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టి.రాజయ్య మాట్లాడుతూ.. కడియం శ్రీహరి ఒక నీచుడు, నికృష్టుడు, దుర్మార్గుడు.. దేశం మొత్తంలోనే ద్రోహి అని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా రాజయ్య ఉద్వేగానికి గురయ్యారు. తాను కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటే శ్రీహరి కంట్ల పెట్టుకుని బాధపెట్టాడని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తన ఎమ్మెల్యే పదవి, ఎంపీ పదవి, ఉప ముఖ్యమంత్రి పదవి అన్నీ లాక్కున్న నికృష్టుడని, దళిత ద్రోహి అని మండిపడ్డారు. అవినీతిలో పెద్ద తిమింగలం అన్నారు. శ్రీహరిని ధర్మసాగర్ చెరువులో తొక్కితే పాకిస్థాన్‌లో తేలాలన్నారు. మొదటిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు ఆయనకు ఉన్న ఆస్తులు.. ఇప్పుడు ఉన్న ఆస్తులు లెక్కచూడాలని అన్నారు. ఇక నుంచి కడియంను ప్రతీచోట నిలదీస్తామని, ఎక్కడైనా ఢీకొనేందుకు సిద్ధంగా ఉన్నామని సవాల్ చేశారు. నిజాయితీపరుడైన సుదీర్‌కుమార్‌ను గెలిపించుకోనేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోరారు. అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. ఇది నీతికి, అవినీతికి మధ్య జరుగుతున్న పోరాటమని, నీతికి పట్టం కట్టి విలువలు కలిగిన రాజకీయాలని కాపాడుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కావ్య గెలుపులో ఎన్ఎస్‌యుఐ కీలక పాత్ర పోషించాలి

వరంగల్ లోక్‌సభ ఎన్నిక, ఎన్ఎస్‌యూఐ సన్నాహక సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి


మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 16: వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టరు కడియం కావ్య గెలుపులో ఎన్ఎస్‌యూఐ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ హంటర్‌రోడ్డులో వరంగల్ లోక్‌సభ ఎన్నిక, ఎన్ఎస్‌యూఐ సన్నాహక సమావేశం జరిగింది. హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పల్లంకొండ సతీశ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా రోహిత్ చౌదరితో పాటు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా రోహిత్ చౌదరీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ మేనిఫెస్టోలో అగ్రనేత రాహుల్‌గాంధీ యువతకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. విద్యారుణాల వడ్డీమాఫీ, ఏటా 30లక్షల ఉద్యోగాల భర్తీ ఇలా యువతకు ప్రయోజనం చేకూరే హామీలు ఇచ్చారన్నారు. ఈ క్రమంలో ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ శ్రేణులు గ్రామీణ ప్రాంతాల నుంచి నియోజకవర్గ స్థాయి వరకు ఇంటింటికీ మేనిఫెస్టో తీసుకెళ్లాలని సూచించారు. అదే విధంగా విద్యారంగ సంస్థలను కూడా సందర్శించి యువతకు వివరించాలన్నారు. పార్టీ కోసం శ్రమించే వారికి తప్పక గుర్తింపు ఉంటుందన్నారు. ఇందుకు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ నిదర్శనమన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు లోక్‌సభ ఎన్నికలో రెండు, మూడు స్థానాల కోసమే పోటీపడుతున్నాయని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ప్రజల్లో విశ్వాసం సడలిందన్నారు. రాహుల్‌గాంధీని ప్రజలు ఆదరిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కడియం కావ్య విషయంలో బీజేపీ శ్రేణులు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తే ఊరుకోమని, బట్టలూడదీసి కొడతామని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హెచ్చరించారు. బీజేపీ పుట్టక ముందే రాముడు దేశ ప్రజలకు దేవుడని స్పష్టం చేశారు. బీజేపీని గద్దె దించడానికి ఎన్ఎస్‌యూఐ శ్రేణులు సైనికుల్లా పోరాడాలని సూచించారు. కష్టపడి పనిచేస్తే పార్టీ తప్పక ఆదరిస్తుందని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు పల్లంకొండ సతీశ్ వెల్లడించారు. బీఆర్ఎస్ పాలనలో ఎన్నో దౌర్జన్యాలను ఎదుర్కొన్నామన్నారు. ప్రతీ విషయంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అండగా ఉన్నారన్నారు. డాక్టరు కడియం కావ్య గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. బీజేపీకి ధనబలం ఉంటే కాంగ్రెస్‌కు జనబలం ఉందని వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కావ్య అన్నారు. బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ కబ్జాల చరిత్రను ప్రజలు మరువలేదన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశానికే ప్రమాదకరమని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వరంగల్ లోకసభ ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, యశస్వినిరెడ్డి, నాగరాజు, గండ్ర సత్యనారాయణ, ఎన్ఎస్ యూ, యూత్ కాంగ్రెస్ నాయకులు గొట్టిముక్కల రమాకాంత్‌రెడ్డి, చందనరెడ్డితో పాటు కత్తి వెంకటస్వామి, బంక సరళ, బత్తిని శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్, సునీతా ఆనంద్, మోజెస్ ఆనంద్, డాక్టర్ శ్రవణ్, బంక సంపత్ యాదవ్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ప్రమాదం

పేలిపోయిన సీటీ పరికరం



సబ్‌స్టేషన్‌లో చెలరేగుతున్న మంటలు

ములుగు, ఏప్రిల్ 16: ములుగులోని 132/33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం రాత్రి 7గంటల సమయంలో ప్రమాదం జరిగింది. ఖాసిందేవిపేట ఫీడర్‌కు విద్యుత్ సరఫరా చేసే విభాగంలోని సీటీ పరికరం ఒక్కసారిగా మంటలు మండుతూ పేలిపోయింది. దీంతో సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఉలిక్కిపడ్డారు. పక్కనే 33/11కేవీ సబ్‌స్టేషన్ ఉంది. వెంటనే సరఫరాను నిలిపివేసిన సిబ్బంది అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. కొద్దిసేపటికే మంటలు ఆరిపోయాయి. ఓవర్‌లోడ్, అధిక టెంపరేచర్ కారణంగా సీటీ పరికరంలోని ఆయిల్ మండిపోయి పేలుడుకు గురైందని ట్రాన్స్‌కో డీఈ నాగేశ్వర్‌రావు తెలిపారు. ఏఈ సాయికృష్ణ, ఎస్సైలు వెంకటేశ్వర్, లక్ష్మారెడ్డితో కలిసి పరిస్థితిని సమీక్షించారు. ఇక్కడి నుంచే వెంకటాపూర్(రామప్ప), ములుగు మండలాలకు విద్యుత్ సరఫరా జరుగుతుండగా గంటపాటు అంతరాయం ఏర్పడింది. ప్రత్యామ్నాయ లైన్ ద్వారా అధికారులు విద్యుత్‌ను పునరుద్ధరించారు.

అడవుల్లో మంటలు ఆర్పిన ఎఫ్‌డీవో

మహదేవపూర్ రూరల్: పలిమెల రేంజ్ పరిధిలోని అడవుల్లో ప్రమాదవశాత్తు అంటుకున్న మంటలను మహదేవపూర్ ఫారెస్టు డివిజనల్ అధికారి వజ్రారెడ్డి మంగళవారం ఆర్పారు. కామన్‌పల్లి వెస్ట్ బీట్ పరిధిలో వాచ్‌టవర్‌తో పాటు వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు సోలార్ సిస్టంతో నడిచే బోర్‌వెల్‌ను ఎఫ్‌డీవో ప్రారంభించారు. ఈక్రమంలో పలిమెల బీట్ పరిధిలో అటవీలో చెలరేగిన మంటలను సిబ్బందితో కలిసి ఎఫ్‌డీవో ఆర్పారు. వెంటనే ఫైర్ బ్లోయర్స్‌తో అడవిలో మంటలు చెలరేగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. పలిమెల బీట్‌తో పాటు కామన్‌పల్లి వెస్ట్‌బీట్ పరిధిలో మంటలు వ్యాపించకుండా ఫైర్ బ్లోయర్స్‌తో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. అటవీశాఖ పర్మిషన్ తీసుకుంటే వాచ్‌టవర్ నుంచి వన్యప్రాణులను, అటవీ అందాలు వీక్షించేందుకు సందర్శకులను అనుమతిస్తామని అన్నారు. ఆయన వెంట ఎఫ్ఆర్‌వో వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా సీతారాముల ఎదురుకోలు సేవ



ఏటూరునాగారంలో మేళతాళాలతో సీతారాముల తలంబ్రాలను ఆలయానికి చేస్తున్న భక్తులు

ఏటూరునాగారం, ఏప్రిల్ 16 : మండల కేంద్రంలోని శ్రీసీతారామ చంద్ర స్వామి ఆలయంలో మంగళవారం ఎదురుకోలు సేవ వైభవంగా జరిగింది. శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం సందర్భంగా కల్యాణ వేడుకల్లో భాగంగా ఏటూరునాగారంలో పసుపుకొమ్ములను దంచి పసుపు, బియ్యంతో తలంబ్రాలను తయారు చేశారు. ఉదయం అడవి నుంచి పాలపొరకను తీసుకువచ్చి రామాలయంలో ఏర్పాటు చేసిన పచ్చని పందిరిపై అలంకరించారు. అనంతరం నిత్యారాధన, అభిషేకం, ఆరగింపు, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకుర్పారణ హోమం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అంతేకాకుండా భద్రాచలం నుంచి తీసుకొచ్చిన ముత్యాల తలంబ్రాలను మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం నుంచి మేళతాళాల నడుమ ఆలయానికి చేరవేశారు. ఈ కార్యక్రమంలో పోగుల లక్ష్మీనారాయణ, వేణుగోపాల్, తాడురి రఘు, గాడిచర్ల సాంబయ్య, దీనంబంధుస్వామి పాల్గొన్నారు.

• మహదేవపూర్: మండలంలోని కాళేశ్వరంలో శ్రీరామ నవమి సందర్భంగా మంగళవారం రాత్రి ఎదుర్కోలు సేవ నిర్వహించారు. శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం అనుబంధ దేవాలయ మైన శ్రీ రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎదుర్కోలు సేవ నిర్వహించి గ్రామంలోని పలు వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు.

కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

వాజేడు: మండలంలో శ్రీరామ నవమికి ఏర్పాట్లు పూర్త య్యాయి. మండల కేంద్రంతోపాటు జగన్నాథపురం, చీకుపల్లి, ధర్మవరం, గొల్లగూడెం, పేరూరు, చంద్రుపట్ల, కొంగాలలో శ్రీసీతారామ చంద్రస్వామి వారి కల్యాణ్యానికి నిర్వహకులు ఏర్పాట్లను చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా కల్యాణ ప్రాంగాణాలలో చలువ పందిళ్లు, తాగునీరు తదితర సౌకర్యాలను కల్పించారు.

• వెంకటాపూర్(రామప్ప): శ్రీ రామ నవమిని పురస్క రించుకుని సీతారామ కల్యాణోత్సవానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మండలకేంద్రంలోని సీతారా మాంజ నేయస్వామి దేవాలయంలో కొలువుదీరిన సీతారామ చంద్రస్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అర్చకులు ముడుంబ రఘునాథాచార్యులు తోపాటు శ్రీ వెంకటేశ్వర ధార్మిక భజన మండలి సభ్యులు తెలిపారు.

పంటల నష్టాన్ని అంచనా వేయండి

• స్థాయీ సంఘాల సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఏప్రిల్ 16: సాగునీరు లేక ఎండిపోయిన పంటల నష్టాన్ని అంచనా వేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం జరిగిన స్థాయీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నీటి సరఫరాపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. బోర్ల రిపేరు చేపట్టాలని, పైపులైన్ లీకేజీలు సరిచేయాలని, కొత్త పైపులైన్లు వేయాలని అన్నారు. తాగునీటి కి ఇబ్బందులు లేకుండా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ పనులకు అంచనా వ్యయాన్ని తయారు చేసి తనకు సమర్పించాలని సూచించారు. అనంతరం పలువురు జడ్పీటీసీలు తమ పరిధిలో ఉన్న గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సభా దృష్టికి తీసుకొచ్చారు. సమస్యల పరిష్కారానికి అధికారులు సహకరించాలని కోరారు. వివిధ శాఖలపై రివ్యూ సాగించగా పలువురు అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడంతో ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ కళ్లెపు శోభ, సీఈవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలి

అధికారులతో కలెక్టర్ భవేష్ మిశ్రా



మహదేవపూర్‌లో మహిళలను నీటి సమస్య గురించి అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

మహదేవపూర్ రూరల్, ఏప్రిల్ 16: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో నీటి ఎద్దడిని నివారించాలని అధికారులను భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. కాటారం, మహదేవపూర్ మండలాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. కాటారంలోని అయ్యప్ప కాలనీలో నీటిసరఫరాపై ఆరా తీశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్, ఎంపీడీవో, గ్రిడ్ ఏఈలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. నీటి సరఫరా, ఎద్దడి నివారణ చర్యలపై సమీక్షించారు. ఇంటింటి సర్వే నిర్వహించి వారం రోజుల్లోగా తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. నల్లాలకు మోటార్లు బిగించి నీటి దుర్వినియోగానికి పాల్పడిన వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. మోటార్లను సీజ్ చేసి, క్రిమినల్ కేసులు సైతం నమోదు చేయాలన్నారు. వారంరోజుల్లో తాను మళ్లీ వస్తానని, అప్పుడు కూడా ప్రజల నుంచి ఫిర్యాదుల వస్తే వెంటనే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. అనంతరం మహదేవపూర్ మండల కేంద్రంతోపాటు బొమ్మాపూర్ ఎస్సీకాలనీ, రాపల్లికోట గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్ నీటి సరఫరాపై ఆరా తీశారు. వేసవి దృష్ట్యా ఈమూడు నెలలు తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. పైప్‌లైన్లలో సమస్య ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట మహదేవపూర్, కాటారం తహసీల్దార్లు ప్రహ్లాద్, నాగరాజు, ఎంపీడీవోలు ప్రసాద్, బాబు, మిషన్ భగీరథ గ్రిడ్ ఇంజనీర్లు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులు ప్రారంభించాలి

భూపాలపల్లి కలెక్టరేట్ : భూపాలపల్లి మునిసిపల్ పరిధిలోని 16వ వార్డు రాంనగర్ కాలనీలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహం ఆవరణలో గుర్తించిన స్థలంలో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. భూపాలపల్లి పట్టణంలో కలెక్టర్ మంగళవారం పర్యటించారు. 16 వార్డులో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్‌ను ఆదేశించారు. అనంతరం 6 ఇన్‌క్లైన్‌లోని ఫిల్టర్ బెడ్‌ను కలెక్టర్ పరిశీలించారు. ల్యాబ్‌లో పరీక్షించాకే మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలన్నారు. వేసవి ముగిసే వరకు సింగరేణి యాజమాన్యం సగటున రోజుకు గంటపాటు నీటిని సరఫరా చేయాలన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్టు

మహదేవపూర్ రూరల్ (కాటారం), ఏప్రిల్ 16 : ఇద్దరిపై హత్యాయత్నం కేసును కాటారం పోలీసులు నమోదు చేశారు. ఈ మేరకు ఎస్సై అభినవ్ మంగళవారం వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం పెర్కపల్లి గ్రామానికి చెందిన జరుపుల రామకృష్ణ కుటుంబ సహా ఫిబ్రవరి 7న మేడారం వెళ్లొస్తున్న క్రమంలో కాటారం మండల కేంద్రంలో రూట్ తెలియక కారు ఆపారు. అటు వైపు వచ్చిన అదే గ్రామానికి చెందిన జక్కు రాజేశ్, మారుపాక రిష్యంత్‌ను బెలంపల్లి రూట్ అడిగారు. ఈ క్రమంలో ఘర్షణ చోటుచేసుకొని ఆ యువకులు వారిపై దాడి చేసి గాయపర్చారు. బాధితుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసుకున్నామని, విచారణ అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీకొన్న లారీ

మహదేవపూర్ రూరల్ (కాటారం), ఏప్రిల్ 16 : ఆగి ఉన్న వ్యాన్‌ను లారీ ఢీకొన్న సంఘటన కాటారం మండలంలోని బయ్యారం క్రాస్ సమీపంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. మిర్చిలోడ్‌తో వరంగల్ వెళ్లేందుకు ఉన్న వ్యాన్‌ను భూపాలపల్లి నుంచి కాటారం వైపు ఇసుకలోడ్ కోసం వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో వ్యాన్‌డ్రైవర్ శ్రావణ్‌కు గాయాలయ్యాయి. వ్యాన్ పూర్తిగా దెబ్బతింది.

ఓపెన్‌స్కూల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ మహేందర్‌జీ

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 16: ఈనెల 25 నుంచి మే 2 వరకు జరిగే ఓపెన్‌స్కూల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ సి.హెచ్.మహేందర్‌జీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మూడు ఓపెన్ టెన్త్ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయనుండగా 526 మంది, ఓపెన్ ఇంటర్ పరీక్ష కేంద్రాలు మూడు ఏర్పాటు చేయనుండగా 602 మంది పరీక్షలు రాయనున్నారని అన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను అనుమతించొద్దన్నారు. విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, విద్యుత్‌శాఖ డీఈ నాగేశ్వర్‌రావు, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు, టీఓఎస్ఎస్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ శంకర్‌రావు, ప్రభుత్వ పరీక్షల సహాయ నియంత్రణ అధికారి అప్పని జయదేవ్, ఆర్ఎస్సై కనకయ్య, ఆర్టీసీ డిపో మేనేజర్ శంకర్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

మహదేవపూర్ రూరల్(కాటారం), ఏప్రిల్ 16 : కాటారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సీవో ఎడ్ల సతీష్ మంగళవారం ప్రారంభించారు. మండలంలోని ధన్వాడ, శంకరాంపల్లి, గంగారం, విలాసాగర్, జాదరావుపేటల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని ఆయన తెలిపారు. రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

మల్హర్, ఏప్రిల్ 16 : మండల కేంద్రమైన తాడిచర్లలోని రేగడిపల్లిలో ఏర్పడిన నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు ఎంపీడీవో శ్యామ్ సుందర్ తెలిపారు. నీటి సమస్య ఏర్పడిన రేగడిపల్లిలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమేష్, ఎంపీపీ చింతలపల్లి మల్హర్‌రావుతో కలిసి ఎంపీడీవో మంగళవారం పర్యటించారు. కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాత్కాలికంగా ట్యాంకర్ ద్వారా కాలనీకి నీటిని సరఫరా చేశారు. నీటి సమస్య పరిష్కారానికి మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టినట్లుతెలిపారు. వారి వెంట ఏఈ హరిత, కార్యదర్శి మల్లికార్జున్‌రెడ్డి ఉన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 16: అగ్ని ప్రమాదాలపై ములుగు అగ్నిమాపక కేంద్ర అధికారి ఎమ్డీ.అబ్దుల్ రహీం ఆధ్వర్యంలో పట్టణ వాసులకు మంగళవారం అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. వంటగ్యాస్ ద్వారా ప్రమాదం సంభవిస్తే ఏవిధంగా దానిని అరికట్టాలో మాక్‌డ్రిల్ ద్వారా సిబ్బంది అవగాహన కల్పించారు. గ్యాస్ ప్రమాదం సంభవించినప్పుడు భయాందోళనకు గురికాకుండా వెంటనే రెగ్యులేటర్ ఆఫ్ చేసి ఒక తడి గోనె సంచి లేదా బ్లాంకెట్‌ను సిలిండర్‌పై కప్పి గాలి తాకకుండా మూసివేస్తే ఆ ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మహేశ్వర్, రమేష్, సురేందర్, ధన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలగొద్దు

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 16: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ములుగు సివిల్ సప్లయ్ అధికారి రాంపతి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని, తేమ శాతం చూసుకోవాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ధాన్యాన్ని మిల్లర్లకు పంపాలన్నారు. ధాన్యంలో ఎలాంటి తరుగు లేకుండా మిల్లర్లు దిగుమతి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రామచందర్, సొసైటీ కార్యదర్శి సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

అబ్బాపూర్ వాసికి డాక్టరేట్



ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 16: ములుగు మండలంలోని అబ్బాపూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కందాల రామయ్య డాక్టరేట్ పొందారు. మనో విజ్ఞానశాస్త్రంలో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పట్టా అందుకున్నారు. ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఒత్తిడిని అధిగమించే విధానాలపై 'ఉద్వేగ ప్రజ్ఞ, వృత్తిపరమైన ఒత్తిడి, మూర్తిమత్వం' అనే అంశంపై కాకతీయ యూనివర్సిటీ సైకాలజీ విభాగ అధిపతి ఆచార్య వల్లూరి రామచంద్రం పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ఈసందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ విద్యా మనోవిజ్ఞాన శాస్త్ర ఆచార్యులు డాక్టర్ అనుపమ, స్వాతి, పారిపల్లి శంకర్, ములుగు డీఈవో పాణి, ప్రధానోపాధ్యాయులు రామయ్యను అభినందించారు.

బీజేపీ గోరికొత్తపల్లి అధ్యక్షుడిగా రాజేందర్‌రెడ్డి



రేగొండ, ఏప్రిల్ 16: బీజేపీ గోరికొత్తపల్లి మండల అధ్యక్షుడిగా సర్గారి రాజేందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గోరికొత్తపల్లిలో మంగళవారం జరిగిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశీధర్‌రెడ్డి ఈ మేరకు ప్రకటించారు.

పాఠశాలల మరమ్మతులు పూర్తి చేయాలి

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 16: పాఠశాలల మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె అదనపు కలెక్టర్ పి.శ్రీజతో కలిసి వెంకటాపురం జడ్పీహెచ్ఎస్, వీరభద్రపురం యూపీఎస్ పాఠశాలలను సందర్శించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధి కోసం రూపొందించిన ప్రతిపాదనలో 25శాతం నిధులు ముందస్తుగా అమ్మ ఆదర్శ పాఠశాలలకు మంజూరు చేయడం జరిగిందని, వాటిని వినియోగించుకుని పనులు రికార్డు చేసిన వారంరోజుల్లోనే బిల్లులు చెల్లించేలా ఏర్పాట్లు చేశామని అన్నారు. నిధులకు ఎటువంటి ఇబ్బంది లేనందున పాఠశాలల అభివృద్ధి పనులను అత్యంత ప్రాధాన్యతతో సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన ఎలక్ట్రికల్ వస్తువులు, ఇతర చిన్నచిన్న పనులు వెంటనే పూర్తి చేయాలని అన్నారు. పాఠశాలల పునఃప్రారంభానికి ముందే తప్పనిసరిగా బాలికలు, బాలురకు మరు గుదొడ్లు, తాగునీటి సరఫరా, తరగతిగదిలో ఉన్న మైనర్ రిపేర్లను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని, మరమ్మతు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని, పోలింగ్ కేంద్రాలుగా ఉన్న పాఠశాలల్లో మరమ్మతు పనులన్నీ ఈనెలలోనే పూర్తి చేయా లన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి స్వర్ణలత లెనిన, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఎంఈవో వెంకటేశ్వర్‌రావు, పీఆర్ ఏఈ రాజేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు సెల్ఫీ పాయింట్ ప్రారంభం

ములుగు కలెక్టరేట్ : కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటుచేసిన ఓటరు సెల్ఫీ పాయింట్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెరిగేలా ఓటర్లకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ పి.శ్రీజ, డీఆర్‌డీవో శ్రీనివాస్‌కుమార్, ఈజీఎస్ ఏపీడీ వెంకటనారాయణ, డీపీఎం సతీష్, ఏపీఎం పాషా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు

ద్రోహం చేసిన కేసీఆర్

• బీజేపీ ఎంపీ అభ్యర్థి సీతారాం నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న సీతారాం నాయక్

డోర్నకల్, ఏప్రిల్ 16: తెలంగాణ ఉద్యమంలో చురుగా పాల్గొన్న ఉద్యమ నాయకులను కేసీఆర్ ద్రోహం చేశారని బీజేపీ ఎంపీ అభ్యర్థి, ప్రొఫెసర్ అజ్మీరా సీతారాంనాయక్ ఆరోపించారు. డోర్నకల్ జైన్‌భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్‌ను మానుకోటకు తీసుకువచ్చి, ప్రజలపై కాల్పులు జరిపించిన రెడ్యానాయక్, ఆయన కుమార్తె కవితను ప్రజాప్రతినిధులుగా చేశారని, తనలాంటి ఉద్యమకారులను అణగదొక్కి ఉద్యమద్రోహులైన వారికి పదవులు కట్టబెట్టారని విమర్శించారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు దేవాసింగ్‌నాయక్, రూరల్ మండల పార్టీ అధ్యక్షులు గణేష్‌నాయక్, డోర్నకల్ నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ భూక్య సంగీత, నాయకులు రెహమాన్, జయరాజ్, సుదర్శన్, రాంబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మూడేళ్ల కిందటి రోడ్డు నిర్మాణంపై చర్యలా..?!

కుట్ర పూరితంగానే హరిబాబు అరెస్టు

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఏప్రిల్ 16: రైతుల సౌకర్యార్థం మూడేళ్ల క్రితం రోడ్డును నిర్మిస్తే అధికారులు ఇప్పుడు చర్యలు తీసుకోవడమేమిటని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రశ్నించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు అరెస్టు కుట్ర పూరితంగా జరిగిందని ఆరోపించారు. 2021లో ఆ ప్రాంత రైతుల సౌకర్యార్థం వారి ఒప్పందం మేరకు రోడ్డు నిర్మాణం చేపట్టినట్టు గుర్తు చేశారు. ఖాసింపల్లి నుంచి కుర్తి ఒర్రె వరకు రూ. 15 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతోపాటు టీయూఐఎఫ్‌డీసీ నుంచి రూ. 25 లక్షల నిధులు వెచ్చించి కుర్తి ఒర్రి నుంచి తుండ్ల రోడ్డు వరకు రోడ్డు నిర్మాణం జరిగిందన్నారు. ఆ రోడ్డు ఒక్క వ్యక్తి కోసం వేసింది కాదని స్పష్టం చేశారు. 2021లో జరిగిన రోడ్డుపై అధికారులు ఇప్పుడు ఎందుకు స్పందించారో చెప్పాలన్నారు. అధికారులు నిస్పక్ష పాతంగా వ్యవహరించాలితప్ప కుట్ర పూరితంగా వ్యవహరించవద్దని కోరారు. హరిబాబు అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ అరెస్టు సమగ్ర విచారణ జరిపాలని, తప్పుడు కేసును విత్‌డ్రా చేయాలని డిమాండ్ చే శారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు సెగ్గం సిద్ధు, జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడ హరీశ్‌రెడ్డి, కౌన్సిలర్ ముంజంపల్లి మురళీధర్, మాదాసు శ్రీనివాస్, జుమ్మలాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

ఏటూరునాగారం, ఏప్రిల్ 16 : విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ములుగు జడ్పీ సీఈవో, ఏటూరునాగారం మండల ప్రత్యేక అధికారి రమాదేవి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో అమ్మ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయ యాజమాన్య కమిటీలకు మంగళవారం జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాల యాజమాన్య కమిటీలు ఆయా పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, పగుళ్లు తేలిన పాఠశాలాల భవనాలకు మరమ్మతులు చేపట్టాలని, మరుగుదొడ్లు, మూత్రశాలలను అదనంగా విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా సరిపడా ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు సంబంధించిన విషయాలపై చర్చించారు. ఇందుకు పాఠశాలలో చేపట్టబోయే పనులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సదస్సులో ఎంపీడీవో బుస కుమార్, ఎంఈవో అనంతుల సురేందర్, ట్రైబర్ వెల్ఫేర్ ఏఈ లక్ష్మణ్, మండల పాఠశాలాల ప్రధానోపాధ్యాయులు సతీష్, ఐకేపీ సీసీవోలు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.